## భవిష్యత్తులో హైదరాబాద్‌కు భారీ వలసలు!

### ఇన్ఫోసిస్ నారాయణమూర్తి అంచనా



పుణె: వాతావరణ మార్పులతో భవిష్యత్తులో కొన్ని నగరాలు నివాసయోగ్యంగా పనికిరాకుండా పోతాయని, సకాలంలో దీనిపై చర్యలు తీసుకోకపోతే ఆ నగరాల నుంచి హైదరాబాద్, బెంగళూరు, పుణె వంటి నగరాలకు భారీగా వలసలు ఉంటాయని టెక్ దిగ్గజం, ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి అభిప్రాయం వ్యక్తం చేశారు. శుక్రవారం మహారాష్ట్రలోని పుణె నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ భారత్, ఆఫ్రికా వంటి కొన్ని దేశాలలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని చెప్పారు. రానున్న రెండు దశాబ్దాలలో దేశంలోని కొన్ని ప్రదేశాలు నివాసయోగ్యంగా పనికిరాకుండా పోయే అవకాశం ఉందని, దీని ఫలితంగా భారీ వలసలు తప్పవని ఆయన అంచనా వేశారు. అయితే ట్రాఫిక్ సమస్యలు, వాతావరణ కాలుష్యం వంటి కారణాల వల్ల హైదరాబాద్, బెంగళూరు, పుణె వంటి నగరాలలో కూడా జీవించడం అంత సులభం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా కార్పొరేట్ రంగం రాజకీయ నాయకులు, బ్యూరోక్రాట్లతో సమన్వయం చేసుకుని భారీ వలసలు జరగకుండా చర్యలు తీసుకోవలసి ఉంటుందని ఆయన సూచించారు. సమిష్టిగా పనిచేయడం వల్ల ఈ సమస్యను అధిగమించవచ్చని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. కార్పొరేట్ ప్రపంచం, రాజకీయ నాయకులు, బ్యూరోక్రాట్లు కలిసికట్టుగా వాతావరణ మార్పు సమస్యను పరిష్కరించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. భారతీయులకు అన్ని విషయాలలో చివరి నిమిషంలో మేల్కొనే అలవాటు ఉన్నందున 2030లో జరిగే వాతావరణ మార్పు గురించి ఇప్పట్లో అప్రమత్తమయ్యే అవకాశం ఉండదని ఆయన వ్యాఖ్యానించారు. తన వివాదాస్పద సలహాలు, ప్రకటనలతో నారాయణమూర్తి తరచు వార్తలలోకి ఎక్కుతుంటారు. వారానికి 70 గంటల పనిపై ఆయన చేసిన ప్రకటనను టెకీలేకాక కార్పొరేట్ పరిశ్రమ నిపుణులు సైతం స్వాగతించలేదు.

## పెరుగుతున్న యువ కుబేరులు

### భారత మిలియనీర్లలో 15% 30 ఏండ్ల లోపువాళ్లే

న్యూఢిల్లీ: గత దశాబ్దంలో భారత్‌లో కోటీశ్వరుల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. 'సూపర్ రిచ్'లో 15 శాతానికి పైగా 30 ఏండ్ల లోపువారే ఉన్నారని తాజా నివేదిక వెల్లడించింది. అంతే కాదు వీరి సంఖ్య దశాబ్దం చివరినాటికి 25 శాతానికి చేరుకుంటుందని కూడా అంచనా వేసింది. టెక్నాలజీ, ఐపీవోల జారీ, కొత్తగా స్టార్టప్ కంపెనీలు నెలకొల్పటం అనేక మందిని కోటీశ్వరుల జాబితాలో చేర్చిందని 'అనరాక్ ప్రాపర్టీ కన్సల్టెంట్స్' నివేదిక పేర్కొన్నది. 2024లో రోల్స్ రాయిస్, పోష్ వంటి అత్యంత ఖరీదైన కార్ల అమ్మకాలు పెరగడానికి కారణం యువ కోటీశ్వరులేనని పేర్కొన్నది. 'కోటీశ్వరుల జాబితాలో యువ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, టెక్ మార్గదర్శకులు, అనుభవజ్ఞులైన పారిశ్రామికవేత్తల సంఖ్య క్రమంగా పెరుగుతున్నది' అని సంస్థ రిసెర్చ్ హెడ్, ప్రశాంత్ ఠాకూర్ చెప్పారు. వీరి నివేదిక ప్రకారం, భారతీయ మిలియనీర్లలో 40 ఏండ్ల లోపు వాళ్లు 20 శాతం మంది ఉన్నారు.

## శవంతో సెక్స్ నేరం కాదు!

### ఛత్తీస్‌గఢ్ హైకోర్టు

రాయ్‌పూర్: శవంతో సెక్స్ చేయడం భారతీయ క్రిమినల్ చట్టాల ప్రకారం అత్యాచార నేరం కాదని ఛత్తీస్‌గఢ్ హైకోర్టు చెప్పింది. శవాన్ని రేప్ చేయడం భయానక నేరమే అయినప్పటికీ, భారత శిక్షా స్మృతి, పోక్సో నిబంధనల ప్రకారం అది అత్యాచారంగా పరిగణించడం సాధ్యం కాదని తెలిపింది. దోషిని అత్యాచార నేరం కింద శిక్షించడానికి అవకాశం లేదని వివరించింది. రేప్ నేరం కింద దోషిని శిక్షించాలంటే, బాధితురాలు సజీవంగా ఉండాలని స్పష్టం చేసింది.

## గాంధీజీ పాక్ జాతిపిత

### హిందీ గాయకుడు అభిజిత్

న్యూఢిల్లీ: జాతిపిత మహాత్మాగాంధీ 'భారత్‌కు కాదు పాకిస్థాన్‌కు పితామహుడు' అంటూ హిందీ సినీ గాయకుడు అభిజిత్ భట్టాచార్య సంచలన వ్యాఖ్యలు చేశారు. పాడ్‌కాస్ట్‌లో ఓ జర్నలిస్ట్‌తో మాట్లాడుతూ, 'ప్రపంచ సంగీతానికి ఆర్‌డీ బర్మన్ జాతిపిత లాంటి వారు. గాంధీ కంటే గొప్పవారు. భారత్‌కు గాంధీజీ జాతిపిత కాదు. పాక్‌కు జాతిపిత' అంటూ చెప్పుకొచ్చారు.

# హిమాచల్ బాటలో కర్ణాటక!

**గుదిబండగా మారిన గ్యారెంటీలు**

- ఎడాపెడా కాంగ్రెస్ సర్కారు అప్పులు
- రెండు నెలల్లో 347% పెరిగిన రుణాలు
- ఈ ఏడాది లక్ష కోట్లకు పైగా అప్పు
- త్వరలో తెలంగాణదీ అదే పరిస్థితి!






బెంగళూరు, డిసెంబర్ 22: అలవి కాని గ్యారెంటీలు, హామీలతో కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వాటిని నెరవేర్చడానికి రాష్ర్టాన్ని అప్పుల కుప్పగా మారుస్తున్నది. తమ పార్టీ అధికారంలో ఉన్న హిమాచల్ ప్రదేశ్ బాటలో నడుస్తూ ఎడా పెడా అప్పులు చేస్తున్నది. ఈ ఏడాది సెప్టెంబర్, నవంబర్ నెలల్లో కర్ణాటక ప్రభుత్వం తీసుకున్న అప్పుల్లో 347 శాతం పెరుగుదల కనిపించడమే ఇందుకు నిదర్శనం. రాష్ట్ర ఆర్థిక శాఖ లెక్కల ప్రకారం సెప్టెంబర్‌లో సిద్ధరామయ్య సర్కారు రూ.7,349 కోట్ల అప్పులు తీసుకుంది. నవంబర్ చివరి నాటికి ఈ అప్పులు రూ.32,884 కోట్లకు పెరిగాయి. అంటే రెండు నెలల్లోనే ప్రభుత్వం రూ.25,535 కోట్ల రుణాలను తీసుకుంది. ఆరు గ్యారెంటీల అమలు ఒత్తిడి పెరగడంతో ఆర్థిక సంవత్సరం చివరి నాటికి మరిన్ని అప్పుల కోసం వెంపర్లాడనుంది. గ్యారెంటీల అమలు కోసం ప్రభుత్వానికి ప్రతి నెల రూ.4,334 కోట్లు అవసరం అవుతున్నాయి.

**వడ్డీల భారమూ తడిసి మోపెడు**

ప్రస్తుత 2024-25 ఆర్థిక సంవత్సరంలో కాంగ్రెస్ సర్కార్ రూ.1.05 లక్షల కోట్లు అప్పు తీసుకొనే అవకాశం ఉన్నట్టు సమాచారం. గత ఆర్థిక సంవత్సరంలో రూ.90,280 కోట్ల అప్పులు తెచ్చిన ప్రభుత్వం వాటిని కేవలం ఆరు గ్యారెంటీల అమలుకు, పాత రుణాల చెల్లింపు, వడ్డీకి మాత్రమే ఖర్చు పెట్టింది. దీంతో అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన పథకాలను నిధుల కొరత వేధిస్తున్నది. తీసుకున్న అప్పులకు సిద్ధూ సర్కార్ భారీగా వడ్డీలు చెల్లించాల్సి వస్తోందని ఆర్థిక శాఖ వాపోయింది. ఈ ఏడాది ఏప్రిల్-నవంబర్ మధ్యలో ప్రభుత్వం తాను తీసుకున్న రుణాలకు అసలు, వడ్డీ కింద రూ.33,831 కోట్లు చెల్లించింది. అంటే సగటున ఒక నెలకు రూ.4,141 కోట్లను అప్పులను చెల్లించడానికి ప్రభుత్వం వినియోగిస్తున్నది. ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి ప్రభుత్వ రుణాలు రూ.6.65 లక్షల కోట్లకు చేరే ప్రమాదం ఉందని ఆర్థిక శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. కాంగ్రెస్ సర్కార్ చేసిన మొత్తం అప్పులు రాష్ట్ర జీఎస్‌డీపీలో 23.24 శాతానికి చేరుకోవడం ప్రమాద ఘంటికలు మోగిస్తున్నది. పరిస్థితి ఇలా ఉంటే ఆరు గ్యారెంటీల లబ్ధిదారుల సంఖ్యలో తేడాలు ఉండటం వల్ల వాటికి అవసరమైన బడ్జెట్‌ను ప్రభుత్వం అంచనా వేయలేకపోతున్నదని అసెంబ్లీ సాక్షిగా సిద్ధరామయ్య పేర్కొన్నారు.

**తెలంగాణలో పరిస్థితి ఎలా ఉంది?**

కర్ణాటకలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ఇక్కడ కూడా అమలు చేస్తామని ప్రజలకు ఆశలు చూపి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వాటి అమలు కోసం కిందా మీద పడుతున్నది. గ్యారెంటీల్లో చాలా పథకాలను అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఇంకా ప్రారంభించలేదు. మరోవైపు అరకొరగా అమలు చేస్తున్న కొద్దిపాటి సంక్షేమ పథకాలను అప్పుల డబ్బులతోనే కాంగ్రెస్ ప్రభుత్వం నెట్టుకొస్తున్నది. ఇందుకోసం ఒక్క ఏడాదిలోనే రూ.1.27 లక్షల కోట్లు అప్పు తెచ్చామని స్వయంగా ముఖ్యమంత్రే ప్రకటించారు. ఈ నేపథ్యంలో కొత్త పథకాలైనా, పాత పథకాలైనా, గ్యారెంటీలైనా అమలు చేయడానికి భారీగా అప్పులు చేయాల్సి వస్తుందని.. అదే పరిస్థితి వస్తే రేవంత్ రెడ్డి సర్కార్ కూడా అప్పుల ఊబిలో కూరుకుపోతుందని ఆర్థికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ఐవీఎఫ్ ఫలితాలను తెలిపే ఏఐ టూల్


### సంతానోత్పత్తి సామర్థ్యం లేని పురుషులకు ఉపయోగకరం

### అభివృద్ధిపరచిన ఐసీఎంఆర్, అమిటీ విశ్వవిద్యాలయం

న్యూఢిల్లీ, డిసెంబర్ 22: పురుషుల్లో సంతానోత్పత్తి సామర్థ్యం లేకపోవడానికి దారి తీసే జన్యుపరమైన కారణాన్ని, ఐవీఎఫ్ ఫలితాలను ముందుగానే తెలుసుకునేందుకు ఓ టూల్‌ను భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) అభివృద్ధి చేసింది. ఇది కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత టూల్. ఈ ఏఐ బేస్డ్ టూల్‌ను 'ఫెర్టిలిటీ ప్రిడిక్టర్' అని పిలుస్తున్నారు. జన్యు సమస్యలతో బాధపడుతున్న పురుషుల్లో అసిస్టెడ్ రీప్రొడక్టివ్ టెక్నాలజీ (ఏఆర్‌టీ) సక్సెస్ రేట్, స్పెర్మ్ రిట్రీవల్ రేట్లను ఈ టూల్ ముందుగా అంచనా వేసి చెప్తుంది. దీనిని అభివృద్ధిపరచడంలో అమిటీ విశ్వవిద్యాలయం సహకరించింది. పురుషుల్లో సంతానోత్పత్తి సామర్థ్యం లేకపోవడానికి కారణమయ్యే వై క్రోమోజోమ్ మైక్రోడిలీషన్‌ను ఇది గుర్తిస్తుంది. ఈ ఏఐ టూల్‌కు సంబంధించిన అధ్యయనం గత వారం 'జర్నల్ ఆఫ్ అసిస్టెడ్ రీప్రొడక్షన్ అండ్ జెనెటిక్స్'లో ప్రచురితమైంది. ఐసీఎంఆర్‌కు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రిసెర్చ్ ఇన్ రీప్రొడక్టివ్ అండ్ చైల్డ్ హెల్త్ సీనియర్ సైంటిస్ట్ దీపక్ మోదీ మాట్లాడుతూ, 50 శాతం మంది దంపతులు సంతానోత్పత్తి సామర్థ్య లేమిని అనుభవిస్తున్నారని చెప్పారు. వీరిలో వీర్యం ఉత్పత్తి సమస్యలు ఉండి ఉండవచ్చన్నారు. దీనికి ప్రధాన కారణాల్లో వై క్రోమోజోమ్ మైక్రోడిలీషన్ ఒకటని చెప్పారు. పురుషుల్లో ఈ జన్యు లోపం వల్ల తగినంత వీర్యాన్ని ఉత్పత్తి చేసే సామర్థ్యం వృషణాలకు ఉండదని, ఫలితంగా సంతానోత్పత్తి సామర్థ్యం లేమికి దారి తీస్తున్నదని వివరించారు. ఇటువంటి పురుషులు తండ్రిగా మారాలనుకుంటే, ఐవీఎఫ్ వంటి అసిస్టెడ్ రీప్రొడక్టివ్ టెక్నిక్స్ అవసరమన్నారు.

## అంతరిక్షంలో పంటల సాగు!

### ఈ నెలాఖరులో 'పీఎస్ఎల్‌వీ-సీ60' మిషన్




న్యూఢిల్లీ, డిసెంబర్ 22: విత్తనాలు మొలకెత్తటం అంతరిక్షంలో ఎలా ఉంటుందో అధ్యయనం చేసేందుకు 'ఇస్రో' సరికొత్త ప్రయోగానికి సిద్ధమవుతున్నది. క్లోజ్డ్ బాక్స్ వాతావరణంలో విత్తనాల అంకురోత్పత్తి (మొలకెత్తటం), రెండు ఆకుల దశ వరకు మొక్కల పోషణ కోసం 8 అలసంద విత్తనాల్ని అంతరిక్షంలో పెంచాలని ఇస్రో భావిస్తున్నది. ఇదే కాకుండా ఇస్రో, ప్రైవేట్ వర్సిటీలు, స్టార్టప్ కంపెనీలకు చెందిన మొత్తం 24 ప్రయోగాలను 'పీఎస్ఎల్‌వీ ఆర్బిటల్ ఎక్స్‌పర్మెంట్ మాడ్యూల్' (పోయెం) ద్వారా చేపట్టబోతున్నారు. ఇందుకోసం ఈ నెలాఖరున 'పీఎస్ఎల్‌వీ-సీ60' మిషన్ ద్వారా భూ కక్ష్యలోకి రెండు శాటిలైట్లను ఇస్రో ప్రవేశపెట్టబోతున్నది. చేజర్, టార్గెట్.. అనే ఈ శాటిలైట్స్‌ను భారత అంతరిక్ష కేంద్రం నిర్మాణంలో కీలక భూమిక వహించనున్నాయి. మానవ సహిత అంతరిక్ష యాత్రలకు అత్యంత కీలకమైన 'స్పేస్ డాకింగ్ టెక్నాలజీ'ని పరీక్షించనున్నారు. విత్తనాల అంకురోత్పత్తి కోసం విక్రం సారాభాయ్ స్పేస్ సెంటర్ వారు 'క్రాప్స్' అనే వ్యవస్థను రూపొందించారు.

## నిప్పుతో అమెరికా చెలగాటం

### తైవాన్‌కు ఆయుధాల విక్రయంపై చైనా ఆగ్రహం

బీజింగ్: తైవాన్‌కు ఆయుధాలు, ఇతర సైనిక సహాయం అందిస్తామన్న అమెరికాపై చైనా ఆగ్రహం వ్యక్తం చేసింది. నిప్పుతో అమెరికా చెలగాటమాడుతున్నదని మండిపడింది. తైవాన్‌కు 571 మిలియన్ డాలర్ల విలువైన యుద్ధ పరికరాలు, సేవలను, సైనిక విద్య, శిక్షణను తైవాన్‌కు ఇచ్చేందుకు అమెరికా అధ్యక్షుడు బైడెన్ శనివారం ఆమోదం తెలిపారు. అమెరికా రక్షణ శాఖ శుక్రవారం 295 మిలియన్ డాలర్ల విలువైన ఆయుధాల విక్రయానికి ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో చైనా విదేశాంగ శాఖ స్పందిస్తూ.. తైవాన్ జలసంధిలో శాంతి, సుస్థిరతలకు విఘాతం కలిగించే ప్రమాదకర చర్యలను ఆపాలని అమెరికాను హెచ్చరించింది. తైవాన్‌కు ఆయుధాలను ఇవ్వొద్దని చెప్పింది. తమ రక్షణ కోసం అమెరికా ప్రభుత్వం నిబద్ధతను తైవాన్ ధ్రువీకరించింది.

## పనామా కాలువను స్వాధీనం చేసుకుంటాం

### ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్: అమెరికా ప్రెసిడెంట్ ఎలక్ట్ డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికల పర్వంలో ఈసారి పనామా కాలువ వంతు వచ్చింది. పనామా కాలువను ఉపయోగించుకునే అమెరికన్ నౌకలకు మితిమీరిన ఛార్జీలను వసూలు చేస్తున్నారని ట్రంప్ 'ట్రూత్ సోషల్'లో ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఓ పోస్ట్ చేశారు. అమెరికన్ నావికా దళం, వాణిజ్యాలను అత్యంత అన్యాయంగా చూస్తున్నారని మండిపడ్డారు. పనామా పట్ల అమెరికా అసాధారణమైన దాతృత్వాన్ని ప్రదర్శించిందని, అయినప్పటికీ పనామా వసూలు చేస్తున్న ఛార్జీలు హాస్యాస్పదంగా ఉన్నాయని స్పష్టం చేశారు. కాలువపై నియంత్రణను అప్పగించడంలోని నైతిక, చట్టపరమైన నిబంధనలను పాటించకపోతే కాలువను పూర్తిగా తిరిగి తమకు ఇచ్చేయాలని డిమాండ్ చేస్తామన్నారు.

## అయోధ్యలో మూడు రోజుల సంబరాలు

### బాల రాముని ప్రాణ ప్రతిష్ఠ తొలి వార్షికోత్సవాలు

అయోధ్య: శ్రీరామ జన్మభూమిలో బాల రాముని ప్రాణ ప్రతిష్ఠ తొలి వార్షికోత్సవం సందర్భంగా వచ్చే నెల 11 నుంచి మూడు రోజుల పాటు సంబరాలు జరుగుతాయి. వీటికి హాజరయ్యే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చెప్పారు. ప్రాణ ప్రతిష్ఠకు ఆహ్వానాలు అందని లేదా హాజరు కాలేకపోయిన సాధువులు, స్వామీజీలను ఈ కార్యక్రమాలకు ఆహ్వానిస్తామన్నారు. అంగద్ తిల వద్ద జరిగే కార్యక్రమాలకు సాధారణ భక్తులు హాజరుకావచ్చు. దేవాలయం ప్రాంగణంలో జరిగే వాటికి ఆహ్వానితులను మాత్రమే అనుమతిస్తారు.

## ట్రూడో తప్పుకోవాలి

### భారత సంతతి ఎంపీ లేఖ

టొరంటో, డిసెంబర్ 22: కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోకు వరుసగా కష్టాలు చుట్టుముడుతున్నాయి. సొంత పార్టీ ఎంపీల నుంచే ఆయన వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. ప్రధాని పదవి నుంచి తప్పుకోవాలని కోరుతూ తాజాగా భారత సంతతికి చెందిన కెనడా ఎంపీ చంద్ర ఆర్య ప్రధాని ట్రూడోకు లేఖ రాశారు. పదవి నుంచి తప్పుకోవలసిన సమయం ఆసన్నమైందని లేఖలో స్పష్టం చేశారు. ట్రూడో స్థానంలో బాధ్యతలు చేపట్టడానికి మాజీ ఆర్థిక మంత్రి క్రిస్టియా ఫ్రీల్యాండ్ సమర్థురాలని చంద్ర తన లేఖలో ప్రతిపాదించారు. జస్టిస్ ట్రూడో రాజీనామా కోరుతూ ప్రతిపక్ష పార్టీలు ఏకమైన నేపథ్యంలో ప్రధాని బాధ్యతల నుంచి తప్పుకోవాలంటూ ఆయనపై సొంత పార్టీ నుంచి ఒత్తిళ్లు తీవ్రమవుతున్నాయి.

## మోదీకి కువైట్ అత్యున్నత పురస్కారం

న్యూఢిల్లీ, డిసెంబర్ 22: ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం కువైట్ అత్యున్నత గౌరవ పురస్కారం 'ది ఆర్డర్ ఆఫ్ ముబారక్ అల్ కబీర్'ను అందుకున్నారు. విదేశాల అత్యున్నత నాయకులకు, రాజ కుటుంబాల సభ్యులకు స్నేహానికి గుర్తుగా ఈ పురస్కారాన్ని అందిస్తారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం శనివారం కువైట్ చేరుకున్న మోదీకి బేయన్ ప్యాలెస్‌లో సైనిక వందనం లభించింది. కువైట్ అమీర్(దేశాధినేత) షేక్ మెషల్ అల్-అహ్మద్ అల్-జబర్ అల్-సబహ్ స్వాగత కార్యక్రమంలో పాల్గొన్నారు. గత 43 ఏండ్లలో భారత ప్రధాని కువైట్‌లో పర్యటించడం ఇదే ప్రథమం.

## పరీక్షల వాయిదా కోసం బాంబు బెదిరింపులు

### విద్యార్థుల ఆకతాయి చర్య

న్యూఢిల్లీ: ఢిల్లీలోని మూడు స్కూళ్లకు ఇటీవల వచ్చిన బాంబు బెదిరింపులు సొంత విద్యార్థుల పనేనని పోలీసులు గుర్తించారు. నవంబర్ 28న రోహిణి ప్రశాంత్ విహార్ వద్ద పేలుడు సంభవించిన మరుసటి రోజే వెంకటేశ్వర్ గ్లోబల్ స్కూల్‌కు బాంబు బెదిరింపు ఈ-మెయిల్ వచ్చింది. పరీక్షలను వాయిదా పడాలని కోరుకున్న ఇద్దరు తోబుట్టువులు గతంలో తమ బడికి వచ్చిన బాంబు బెదిరింపులను దృష్టిలో ఉంచుకొని బాంబు బెదిరింపు మెయిల్ పంపారు. రోహిణి, పశ్చిమ్ విహార్‌లోని మరో రెండు పాఠశాలల విద్యార్థులు కూడా స్కూళ్లు మూతపడాలనే కోరికతో నకిలీ బాంబు బెదిరింపుల ఈ-మెయిల్స్ పంపారు.

## ఉక్రెయిన్‌లో మరింత విధ్వంసం తప్పదు: పుతిన్

మాస్కో: కజాన్ నగరంలోని బహుళ అంతస్తుల నివాస భవనాలపై శనివారం డ్రోన్లతో దాడులు జరిపిన ఉక్రెయిన్ ఎన్నో రెట్లు ఎక్కువ విధ్వంసాన్ని ఎదుర్కొనక తప్పదని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆదివారం హెచ్చరించారు. తాను చేసిన పనికి ఉక్రెయిన్ చింతించక తప్పదని పుతిన్ ప్రకటించారు. ఎవరు ఎంతలా విధ్వంసం సృష్టించడానికి ప్రయత్నిస్తే వారు అంతకు మించి ఎన్నో రెట్ల విధ్వంసాన్ని చవిచూడక తప్పదని అంటూ పుతిన్ హెచ్చరికలు జారీచేశారు.



### ఆత్మాహుతికి యత్నించిన రైతుకు

## 9.9 లక్షల జరిమానా!

జైపూర్: రాజస్థాన్‌లోని ఝుంఝును జిల్లాలో ఆత్మాహుతి యత్నం చేసిన ఓ రైతు కుటుంబానికి పోలీసులు రూ.9.91 లక్షలు జరిమానా విధించారు. విద్యాధర్ యాదవ్, ఆయన కుటుంబ సభ్యులు ఈ నెల 10న చితిపై కూర్చున్నారు. తమకు స్వచ్ఛంద మరణానికి అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీరిని కాపాడటం కోసం ఒక ఏఎస్పీ, ఇద్దరు డిప్యూటీ పోలీసు సూపరింటెండెంట్లు సహా మొత్తం 99 మంది పోలీసు సిబ్బందిని నియమించారు. వీరితోపాటు అధికారిక వాహనాలను కూడా ఉపయోగించారు. దీనివల్ల రాష్ట్ర ఖజానాపై రూ.9,91,577 ఖర్చయింది. ఈ సొమ్మును ఈ నెల 24నాటికి ఎస్పీ కార్యాలయంలోని అకౌంట్స్ బ్రాంచ్‌లో జమచేయాలని యాదవ్‌కు ఝుంఝును ఎస్పీ శరద్ చౌదరి నోటీసు ఇచ్చారు. రాజస్థాన్ ప్రభుత్వ ఆదేశాలను ఈ నోటీసులో ప్రస్తావించారు. ఈ సొమ్మును చెల్లించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తమ వద్ద తీసుకున్న భూములకు శ్రీ సిమెంట్ కంపెనీ నష్టపరిహారం చెల్లించడం లేదని యాదవ్ ఆరోపించారు. ఈ నిరసన నేపథ్యంలో ఆ కంపెనీ రూ.3 కోట్లు చెల్లించేందుకు అంగీకరించింది.

## దివ్యాంగుల కోసం లోన్ యాప్

న్యూఢిల్లీ, డిసెంబర్ 22: దివ్యాంగ యువ పారిశ్రామికవేత్తలు, వ్యక్తులకు నిరంతరాయంగా రుణాలను అందుబాటులోకి తెచ్చే ఒక మొబైల్ యాప్ ఆదివారం ప్రారంభమైంది. జాతీయ దివ్యాంగ్‌జన్ ఆర్థిక, అభివృద్ధి కార్పొరేషన్(ఎన్‌డీఎఫ్‌డీ సీ) రూపొందించిన ఈ మొబైల్ యాప్‌ను 22వ దివ్య కళా మేళా ముగింపు ఉత్సవంలో ప్రారంభించారు. దివ్యాంగ యువ వ్యాపారవేత్తలు, వ్యక్తులను ఆర్థికంగా బలోపేతం చేయడమే ఈ యాప్ లక్ష్యమని అధికారులు తెలిపారు. వారికి అందుబాటులో ఉండే రుణాల వివరాలను ఈ యాప్ నిరంతరాయంగా అందజేస్తుంది.

## రాహుల్ గాంధీకి యూపీ కోర్టు సమన్లు

### జనవరి 7న బరేలీ కోర్టులో హాజరుకు ఆదేశం

బరేలీ(యూపీ): లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఆర్థిక సర్వేకు సంబంధించి వ్యాఖ్యలు చేసినందుకు లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి జనవరి 7న హాజరుకావాలని ఆదేశిస్తూ స్థానిక కోర్టు సమన్లు జారీచేసింది. జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి శనివారం రాహుల్ గాంధీకి సమన్లు జారీచేశారు. అఖిల భారత హిందూ మహాసంఘ్ మండల అధ్యక్షుడు పంకజ్ పాఠక్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఈ సమన్లు జారీ అయ్యాయి. రాహుల్‌పై కేసు నమోదు చేయాలని కోరుతూ ఆగస్టులో ఎమ్మెల్యేఎంపీ కోర్టు/సీజేఎం కోర్టును పాఠక్ తొలుత ఆశ్రయించారు. అయితే ఈ దరఖాస్తును కోర్టు ఆగస్టు 27న తిరస్కరించడంతో ఆయన సెషన్స్ కోర్టులో రివిజన్ పిటిషన్ దాఖలు చేయగా ఇప్పుడు అదే కోర్టు రాహుల్‌కు సమన్లు జారీచేసింది. లోక్‌సభ ఎన్నికల ప్రచార సందర్భంగా రాహుల్ గాంధీ ఆర్థిక సర్వేను ప్రస్తావిస్తూ దేశంలో బలహీన వర్గాల శాతం ఎక్కువగా ఉన్నప్పటికీ వారు సంపాదించుకున్న ఆస్తులు మాత్రం చాలా తక్కువని అన్నారని పాఠక్ తరఫున పిటిషన్ దాఖలు చేసిన న్యాయవాది వీరేంద్ర పాల్ గుప్తా అన్నారు. కులాల మధ్య విద్వేషాలను సృష్టించడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలన్నది రాహుల్ ఆలోచనని ఆయన ఆరోపించారు.



## "వరల్డ్ మెడిటేట్స్ విత్ గురుదేవ్"కు ప్రపంచ రికార్డులు

ప్రపంచ ధ్యాన దినోత్సవంలో భాగంగా న్యూయార్క్‌లోని వరల్డ్ ట్రేడ్ సెంటర్ వద్ద ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీశ్రీ రవిశంకర్ నేతృత్వంలో ఆదివారం జరిగిన ప్రత్యక్ష ధ్యాన కార్యక్రమం ప్రపంచ రికార్డులను తిరగరాసింది. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్, ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, వరల్డ్ రికార్డ్ యూనియన్‌లో స్థానం దక్కించుకుంది. యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారమైన ఈ గైడెడ్ ధ్యాన కార్యక్రమానికి అత్యధిక వ్యూస్ లభించినట్టు గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ప్రకటించింది. భారతలోని అన్ని రాష్ర్టాల నుంచి అత్యధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్న ఈ కార్యక్రమం ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్సును సాధించింది.

## సోలార్ పెయింట్‌తో ఈవీలకు చార్జింగ్

న్యూఢిల్లీ: సౌరశక్తిని విద్యుచ్ఛక్తిగా మార్చగలిగే పెయింట్‌ను తయారు చేసేందుకు మెర్సిడెస్-బెంజ్ కంపెనీ ప్రయత్నిస్తున్నది. ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ)లకు సోలార్ పెయింట్‌ను వేసినపుడు, ఆ వాహనాలు డ్రైవింగ్‌లో ఉన్నా, పార్కింగ్‌లో ఉన్నా, ఆ సోలార్ పెయింట్ సౌర శక్తిని సేకరించగలిగే విధంగా ప్రత్యేక టెక్నాలజీని అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నది. ఈ సోలార్ పెయింట్‌ను పలుచని, ఎలా కావాలంటే అలా సాగగలిగే ఫొటోవోల్టాయిక్ మెటీరియల్‌తో తయారు చేస్తున్నది. దీని బరువు చదరపు మీటరుకు 50 గ్రాములు మాత్రమే ఉంటుంది. ఇది 5 మైక్రోమీటర్ల దళసరిగా ఉంటుంది. ఓ సగటు మధ్యతరహా వాహనం సంవత్సరానికి 7,456 మైళ్ల దూరం ప్రయాణించడానికి అవసరమైన ఇంధనాన్ని సేకరించగలుగుతుందని ఈ కంపెనీ అంచనా వేస్తున్నది. అయితే, సూర్య కాంతి పడటాన్ని బట్టి ఈ ఇంధనం సేకరణ ఆధారపడి ఉంటుంది. ఈ పెయింట్ పర్యావరణ హితమైనదని ఈ కంపెనీ చెప్తున్నది.

## వేగంగా నడిస్తే తగ్గనున్న మధుమేహ ముప్పు!

- హైబీపీ, గుండె సంబంధిత వ్యాధులూ తగ్గే అవకాశం
- జపాన్ వర్సిటీ అధ్యయనంలో వెల్లడి



న్యూఢిల్లీ: నడకలో వేగం ఉంటే డయాబెటిస్ లేదా గుండె సంబంధ వ్యాధులు వచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయని తాజా అధ్యయనంలో వెల్లడైంది. స్థూలకాయం లేదా నడుము చుట్టు కొలత అధికంగా ఉన్న దాదాపు 25,000 మందిని జపాన్‌లోని దోషిషా యూనివర్సిటీ పరిశోధకులు అధ్యయనం చేశారు. మీ వయసు, జెండర్ కన్నా మీ నడక వేగంగా ఉందా అన్న ఒకే ఒక ప్రశ్నను వారికి సంధించి వారి నుంచి సమాధానాన్ని రాబట్టారు. సైంటిఫిక్ రిపోర్ట్స్ అనే జర్నల్‌లో ప్రచురించిన ఈ సర్వే నివేదికలో ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. వేగంగా నడిచే వారిలో డయాబెటిస్ ముప్పు దాదాపు 30 శాతం తక్కువని వెల్లడైంది. హైపర్‌టెన్షన్, డిస్లిపిడీమియా (రక్తంలో అసాధారణ లిపో ప్రొటీన్ లెవల్స్) ముప్పు కూడా చాలా తక్కువని తేలింది. నడక వేగానికి, సమగ్ర ఆరోగ్యానికి మధ్య సంబంధం ఉన్నట్లు పరిశోధకులు తేల్చారు. వేగంగా నడిచే వాకర్లలో గుండె, ఊపిరితిత్తులకు రక్తాన్ని సరఫరా చేసే నాళాల వ్యవస్థ పనితీరు మెరుగ్గా ఉన్నట్టు పరిశోధకులు తెలిపారు. ఈ వ్యవస్థ పనితీరు సరిగ్గా లేనట్టయితే జీవక్రియకు సంబంధించిన వ్యాధులు వచ్చే ముప్పు అధికంగా ఉంటుంది.



## దుబాయ్‌లో ఎయిర్ కండిషన్డ్ వాక్‌వేలు

న్యూఢిల్లీ: ఎడారి నగరం దుబాయ్‌లో ఉక్కపోత నుంచి పాదచారులకు త్వరలోనే ఉపశమనం కలగనుంది. త్వరలోనే ఎయిర్ కండిషన్డ్ నడక మార్గాలు అందుబాటులోకి రాబోతున్నాయి. నగర వ్యాప్తంగా ఈ ఫుట్‌పాత్‌లు ఏర్పాటు కానున్నాయి. 'దుబాయ్ వాక్' పేరుతో చేపడుతున్న ఈ ప్రాజెక్ట్‌లో మొత్తం 6,500 కిలోమీటర్ల పరిధిలో ఈ వాక్‌వేలు అందుబాటులోకి రానున్నాయి. ఇందులో ఏడాది పొడవునా ప్రజలు నడిచేందుకు వీలుగా ఎయిర్‌కండిషనింగ్ ఉంటుంది.

## క్యాన్సర్‌కు దివ్యౌషధం!



వాషింగ్టన్ : నూటికి నూరు శాతం విజయవంతమైన క్యాన్సర్ ఔషధం డోస్టర్లిమాబ్ (బ్రాండ్ పేరు జెంపెర్లి) త్వరలోనే విస్తృతంగా అందుబాటులోకి రాబోతున్నది. దీనికి అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ) బ్రేక్‌త్రూ థెరపీ డిజిగ్నేషన్ హోదాను ఇచ్చింది. జూన్‌లో జరిగిన క్లినికల్ పరీక్షల్లో ఈ ఔషధం చక్కని ఫలితాలను చూపింది. 'న్యూ ఇంగ్లండ్ జర్నల్ ఆఫ్ మెడిసిన్'లో ఈ వివరాలను ప్రచురించారు. ఈ మందు శస్త్ర చికిత్స, రేడియేషన్ ట్రీట్‌మెంట్, కీమోథెరపీ వంటివాటి అవసరం లేకుండానే రెక్టల్ క్యాన్సర్ ట్యూమర్స్‌ను పూర్తిగా నిర్మూలించింది. సమర్థవంతమైన ఇమ్యునోథెరపీ వల్ల రెక్టల్ క్యాన్సర్ రోగుల జీవితాలు మారుతాయి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న చికిత్సల వల్ల సంతానోత్పత్తి సామర్థ్యాన్ని కోల్పోవడం వంటి ప్రతికూల ఫలితాలు వస్తున్నాయి. తీవ్రమైన వ్యాధులకు చికిత్స చేసే నూతన ఔషధాలకు బ్రేక్‌త్రూ థెరపీ డిజిగ్నేషన్‌ను ఇస్తారు. దీనితో సరిపోల్చదగిన ఇతర చికిత్సా విధానాలేవీ లేనపుడు ఈ హోదాను ఇస్తారు. ఇకపై డోస్టర్లిమాబ్ ఔషధాన్ని మరిన్ని పరీక్షలు చేస్తారు. అత్యంత వేగంగా సమీక్షిస్తారు. ఎఫ్‌డీఏ సహాయంతో ఈ ప్రక్రియ వేగవంతమవుతుంది. ఈ దశలో ఇది విజయవంతమైతే, నాన్ బ్రేక్‌త్రూ డ్రగ్స్ కన్నా మూడేళ్ల ముందుగానే ఇది అందుబాటులోకి వస్తుంది.



## బెజోస్ పెళ్లికి రూ.5 వేల కోట్ల ఖర్చు!

వాషింగ్టన్: అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ మరో పెళ్లికి సిద్ధమయ్యారు. తన ప్రియురాలు లారెన్ శాంచెజ్ (54)ను వచ్చే వారంలో వివాహం చేసుకోబోతున్నారు. వీరిద్దరి నిశ్చితార్థం గత ఏడాది జరిగింది. కొలరాడోలోని ఆస్పెన్‌లో కుటుంబ సభ్యులు, మిత్రుల సమక్షంలో రూ.5,000 కోట్ల ఖర్చుతో ఈ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరగబోతున్నది. బిల్ గేట్స్, లియోనార్డో డికాప్రియో వంటి ప్రముఖులు హాజరుకాబోతున్నారు. జెఫ్ బెజోస్ తన భార్య మెకంజీ స్కాట్‌కు 2019లో విడాకులు ఇచ్చారు.